ప్రజాశక్తి
మంగళవారం 4 జూన్, 2024
5
శ్రీకాకుళం

10 నుంచి ఆర్‌టిసిలో డ్రైవింగ్ శిక్షణ

శ్రీకాకుళం అర్బన్: ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 16వ బ్యాచ్‌ను ఈ నెల పదో తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 15 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామని, శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ సర్టిఫికేట్‌తో పాటు హెవీ లైసెన్స్‌లు అందజేసినట్లు పేర్కొన్నారు. మారుతున్న డ్రైవింగ్ విధానాలకు అనుగుణంగా, మంచి అనుభవం కలిగిన డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లతో ఆర్‌టిసిలో హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్ నేర్పించనున్నట్లు తెలిపారు. ఆర్‌టిసిలో శిక్షణ తీసుకున్న ప్రతిఒక్కరికీ ఆర్‌టిసితో పాటు మిగతా ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్‌గా ఉద్యోగావకాశాలు పొందవచ్చని పేర్కొన్నారు. బ్యాచ్‌కు 16 మంది మాత్రమే శిక్షణ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ ఏడాది అనుభవమున్న వారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 40 రోజుల శిక్షణతో పాటు మెకానికల్ వర్క్, విడిభాగాలు, యోగా, వ్యక్తిత్వ వికాసం, రోడ్డు ట్రాఫిక్ రూల్స్ అంశాలపై ఉన్నతమైన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

నేడు ఓటర్ల తీర్పు

ఉత్కంఠ... ఎటు చూసినా నరాలు తెగే ఉత్కంఠ! ఎవరు గెలుస్తారు... ఎవరు ఓటమిపాలవుతారు?. ఏ ఉద్దండుడు తెరమరుగవుతాడు..? ఎవరు తొలిసారిగా గెలుపు రుచి చూస్తారు..? బహుముఖ పోరు ప్రభావం ఎవరి విజయావకాశాలను దెబ్బతీయనుంది..? ఓటింగ్ శాతం ఎవరికి వరం కాబోతుంది..? ఓటర్లు మౌనంగా ఇచ్చిన తీర్పు ఎవరికి అనుకూలం..? ఈ ప్రశ్నలన్నింటికీ మరికొన్ని గంటల్లో సమాధానాలు రాబోతున్నాయి.

- మరికొద్ది గంటల్లో వెల్లడి కానున్న ఫలితాలు
- ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్
- తొలుత ఆమదాలవలస, చివరిగా పాతపట్నం ఫలితం
- అంతా సిద్ధం చేసిన అధికారులు
- జిల్లావ్యాప్తంగా సెక్షన్ 144 అమలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. విజేతలు ఎవరు, పరాజితులు ఎవరనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. బూత్‌ల వారీగా విశ్లేషణలు చేసుకుని ఎవరికి వారు గెలుపుపై ధీమాగా ఉన్నా, మరోవైపు ఆందోళన కూడా నెలకొంది. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. తొలుత పోస్టల్, సర్వీసు ఓట్లు, తర్వాత ఇవిఎంల్లోని ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సెక్షన్ 144, సెక్షన్ 30 విధించారు.

జిల్లాలో మొత్తం 18,61,653 మంది ఓటర్లుగా ఉండగా, గత నెల 13వ తేదీన నిర్వహించిన పోలింగ్‌లో 14,17,959 మంది ఓటు వేశారు. మొత్తం 76.17 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 6,86,120 మంది కాగా, మహిళలు 7,31,822 మంది, ఇతరులు 17 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. జిల్లాలో అత్యధికంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలో 83.28 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా శ్రీకాకుళంలో 70.22 శాతం నమోదైంది. ఓట్ల లెక్కింపునకు అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎనిమిది గదులు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గానికి తొమ్మిది గదులు కేటాయించారు. నియోజకవర్గానికి 14 చొప్పున 112 ఇవిఎం టేబుళ్లను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 29 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఎంపీ సెగ్మెంట్‌కు సంబంధించి 98 ఇవిఎం టేబుళ్లను, 30 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లను సిద్ధం చేశారు. ప్రతి రౌండ్‌లో ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లలో 14 పోలింగ్ బూత్‌ల చొప్పున ఓట్లను లెక్కిస్తారు.

లెక్కింపు ఇలా...

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభానికి ముందు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల పరిశీలకులు, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల సీల్ తీస్తారు. ఆ తర్వాత ఇవిఎంలను నంబర్ల వారీగా లెక్కింపు హాళ్లకు పోలీసు భద్రత మధ్య ఒక్కొక్కటిగా తీసుకొస్తారు. అనంతరం ఇవిఎంల సీళ్లు సక్రమంగానే ఉన్నాయని నియోజకవర్గాల ప్రత్యేక పరిశీలకులు, ఏజెంట్లు నిర్ధారించుకున్న తర్వాత సీళ్లు విప్పుతారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ మీద బ్లూ పాయింట్ పెన్, ఫారం 17సిలను ఉంచుతారు. కౌంటింగ్‌కు ముందు 17సి ఫారం ఆధారంగా పోలైన ఓట్లు ఇవిఎంల్లో నిక్షిప్తమైన ఓట్లు సక్రమంగా ఉన్నాయో, లేదో సరిచూసుకుంటారు. వాటిని నోట్ చేసుకోవడంతో పాటు పలు రాజకీయ పార్టీల ఏజెంట్లకు చూపించి వారి సంతకాలు తీసుకుంటారు. ఆ తర్వాత ఇవిఎంల సీళ్లను తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారు. ఒక్కో బటన్‌లో ఎన్ని ఓట్లు వచ్చాయో డిస్‌ప్లే అవుతుంది. ఈ గణాంకాలను నోట్ చేసుకుంటారు. ఒక్కో రౌండ్‌లో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్డుపై రాసి ప్రకటిస్తారు. ఇలా ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. ఏజెంట్లు సంతృప్తి చెందిన తర్వాతే రౌండ్ ఫలితాన్ని ప్రకటిస్తారు.

నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు, టేబుళ్లు, రౌండ్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	టేబుళ్లు	రౌండ్లు
ఆమదాలవలస	1,92,623	1,54,357	14	19
ఎచ్చెర్ల	2,42,895	2,03,831	14	23
ఇచ్ఛాపురం	2,66,161	1,87,024	14	22
నరసన్నపేట	2,13,083	1,73,828	14	21
పలాస	2,18,448	1,65,257	14	21
పాతపట్నం	2,23,636	1,60,107	14	24
శ్రీకాకుళం	2,70,327	1,86,658	14	20
టెక్కలి	2,34,480	1,86,897	14	23

బరిలో 86 మంది అభ్యర్థులు

ఎన్నికల బరిలో మొత్తం 86 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 73 మంది, శ్రీకాకుళం ఎంపీ స్థానానికి 13 పోటీలో ఉన్నారు. వైసిపి, కాంగ్రెస్ అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాయి. టిడిపి ఏడు చోట్ల తన అభ్యర్థులను నిలిపి, ఎచ్చెర్లలో తన మిత్రపక్షమైన బిజెపికి కేటాయించింది. వైసిపి, టిడిపి నుంచి ముఖ్యులు బరిలో నిలిచారు. ఆమదాలవలస స్థానం నుంచి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, శ్రీకాకుళం నుంచి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పలాస నుంచి పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పోటీలో ఉన్నారు. టిడిపి నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి నుంచి పోటీ పడుతున్నారు.

కౌంటింగ్‌కు 1,996 మంది సిబ్బంది

కౌంటింగ్ కోసం 1,996 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో రిటర్నింగ్ అధికారులు తొమ్మిది మంది, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు 77 మంది, కౌంటింగ్ అసిస్టెంట్‌లు 582 మందిని నియమించారు. మైక్రో అబ్జర్వర్లు 397 మందిని, నాలుగో తరగతి ఉద్యోగులను 439 మందిని విధులకు వినియోగిస్తున్నారు. కౌంటింగ్ సజావుగా సాగేందుకు ఎన్నికల సంఘం నియమించిన ఎనిమిది మంది ప్రత్యేక అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడెంచెల భద్రతతో పాటు అదనంగా ఒక వలయంలో పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. భద్రత కోసం 1459 మంది పోలీసులను వినియోగిస్తున్నారు. వీరితో పాటు ఒక కంపెనీ సిఐఎస్‌ఎఫ్, ఎపిఎస్‌పి ఒక ప్లాటూన్ బెటాలియన్ అదనపు బలగాలు బందోబస్తు నిర్వహించనున్నాయి. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలతో పాటు జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30, 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

అభ్యర్థుల్లో టెన్షన్

వైసిపి, టిడిపి నాయకులు ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ శాతం భారీగా నమోదు కావడంతో అదంతా ప్రభుత్వ వ్యతిరేకతేనని, తాము విజయం సాధిస్తామని టిడిపి అభ్యర్థులు గట్టిగా చెప్తున్నారు. మహిళా ఓటర్లు, సంక్షేమ పథకాల అమలుతో సానుకూల ఓటింగ్ జరిగిందని తమ గెలుపు పక్కా అని వైసిపి అభ్యర్థులు విశ్వసిస్తున్నారు. పార్టీల విజయావకాశాలపై రెండు పార్టీలూ ధీమాగా ఉన్నా, వారి సీట్లకు సంబంధించి మాత్రం ఆందోళన నెలకొంది. తమకు పోలయ్యే ఓట్లపై వేసుకున్న లెక్కలన్నీ సంతృప్తినిచ్చినా మనసులో ఏదో మూలన కీడు శంకిస్తోంది. గట్టెక్కుతామా లేదా అన్న సంశయం వారిని వెంటాడుతోంది. పలు సర్వే సంస్థలు రకరకాల ఫలితాలను వెల్లడించడంతో మరింత ఉత్కంఠ నెలకొంది. వాటిలో అత్యధిక సర్వేలు టిడిపి కూటమి గెలుస్తుందని చెప్పడంతో ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంతో ఉన్నాయి. మరికొన్ని సర్వే సంస్థలు వైసిపి నెగ్గుతుందని చెప్పడంతో ఆ పార్టీ శ్రేణులూ ధీమాగానే ఉన్నాయి. తమదే విజయమంటూ అభ్యర్థులు, నాయకులు బయటకు చెప్తున్నా, వారిని మాత్రం ఓ వైపు ఆందోళన వెంటాడుతోంది.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లను లెక్కించే ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు నిర్వర్తించే పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సూక్ష్మ పరిశీలకుల రెండో విడత శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతియుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగాలని సూచించారు. ఆరు నెలలుగా ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు రిటర్నింగ్ అధికారుల నుంచి పలు స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది విశేష కృషి చేశారని చెప్పారు. లెక్కింపు కేంద్రాల్లోని ప్రతి టేబుల్ వద్ద ఒక సూక్ష్మ పరిశీలకుని పర్యవేక్షణ ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఇటిపిబిఎస్, ఇవిఎంల్లో ఓట్లు, వివిప్యాట్ల ఓటరు స్లిప్పులు లెక్కించాల్సి ఉంటుందన్నారు. లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్‌లను నిర్వహించడం, ఎలక్ట్రానిక్‌గా ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ , ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లు , ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్స్ వంటి పలు అంశాల నిశిత పరిశీలన ఉంటాయన్నారు. లెక్కింపు ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విధులు కేటాయించిన ప్రొసీడింగ్స్‌తో పాటు గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు. శిక్షణా తరగతుల్లో జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్, పరిశీలకులు తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్, మాలతుస్ ఎస్ సంగమ్, అనుజకుమార్ దాస్, అశోక్ కుమార్, ఎస్.సంగీత, అజిజ్ శుక్లదాస్, మాస్టర్ ట్రైనర్ శేషగిరి, ఎల్‌డిఎం సూర్యకిరణ్, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకుని కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో ఫారం-13సి, ఫారం-13ఎ, ఫారం-13బిలకు సంబంధించిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సర్వీస్ ఓటర్లకు సంబంధించి బ్యాలెట్ల లెక్కింపులో జాగ్రత్త వహించి మార్గదర్శకాలకు అనుగుణంగా లెక్కించాలన్నారు. సొంత ఆలోచనలకు తావు లేకుండా, నిబంధనలను విధిగా పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింహాసనం అధిష్టించేది ఎవరో?

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని మండలంలోని గాజులకొల్లివలస వద్ద ఉన్న సంగమేశ్వర స్వామి కొండ దిగువన సైకత శిల్పి గేదెల హరికృష్ణ 'సింహాసనం అధిష్టించేది ఎవరో' పేరిట సైకతశిల్పం రూపొందించారు. నరేంద్ర మోడీ, రాహుల్ గాంధీ, వైఎస్ జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు సైకత శిల్పాలతో పాటు మధ్యలో సింహాసనంతో వేసిన సైకతశిల్పం పలువురిని ఆకట్టుకుంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

'ఉపాధి' కూలీలపై కందిరీగల దాడి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పరిధిలో చెరువు పనులు చేస్తున్న ఉపాధి కూలీలపై సోమవారం కందిరీగలు దాడి చేశాయి. మామిడిపల్లి-పాత్రపురం గ్రామాల మధ్య ఉన్న ఖార్జి చెరువులో ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. సుమారుగా 60 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఈ సమయంలో కందిరీగలు చెలరేగి ఒక్కసారిగా కూలీలపై దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు 12 మందికి గాయాలయ్యాయి. మిగతా వారంతా భయాందోళనతో పరుగులు తీశారు. అందులో కోరుబిల్లి దశమయ్య అనే వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం హరిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి పలాస ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. మిగతా వారు హరిపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు జుత్తు సింహాచలం, గొరకల మన్మథరావు, సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపిటిసి దున్న మాధవరావు, పాతిన రామారావు, సొర్ర రామారావు, పాతిన నాని, ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.నారాయణ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT SRIKAKULAM.
EP.110/2019 in OS.402/2015

Between: **Yagati Jayalakshmi**
---Dhr/Plaintff/Petitioner
And: **Dandi Ramesh kumar**
---Jdr/Defendant/Respondent

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ హోల్డర్‌కు రావలసిన అసలు మొత్తం పైకం వగైరాలు రాబట్టుకోనే నిమిత్తం ప్రతివాది/జె.డి.ఆర్ తాలుకా ఈ దిగువ షెడ్యూల్ దఖలా స్థిరాస్తి వేలం వేయుట మూలంగా రాబట్టుమని కోరుతూ పై అమలు కేసు దాఖలు చేసియున్నారు. సదరు అమలు పిటిషన్‌లో శ్రీకోర్టు వారు జడ్జిమెంట్ డెటార్ తాలుకా దిగవ షెడ్యూల్ ఆస్తిని **తేదీ 25-06-2024 పగలు 10:30 ని॥ లకు** పై కోర్టులో వేలం జరుపుటకు నిర్ణయించినారు. కావునా సదరు బహిరంగ వేలంలో పాల్గోనదలచిన వారు పై కోర్టు వారి ఎదుట తేది **25-06-2024 ఉ॥ 10.30 ని॥** లకు హాజరై వేలం పాడుకొనవచ్చును. వేలం షరతులను గూర్చి డిక్రీ హోల్డర్ తరుపున న్యాయవాది వద్ద గాని, పై కోర్టు సూపరింటెండెంట్ వారిని గాని అడిగి తెలుసుకోవలెను.

Auction Schedule Particulers

Srikakulam District – Srikakulam Sub-register – Patha Srikakulam, – Town Survey Number 377/2, 1st part for an extent of A.c. 1.05 cents, and 2nd part A.c. 0.30 cents Vacant sites situated within the following boundaries as follows:

1st Part Boundaries:
East - Water channel
West - Vijayalakshmi's A.c 0.18 cents of land
South - Vijayalakshmi Dry land
North - Krishna Wet Land

2nd Part Boundaries:
East - Krishnayya @ Radha krishna wet land
West - Water channel
South- Water channel
North - Krishnayya Wet Land

Market Value of the above said immovable **property: Rs.13,00,000/-** (Thirteen Lakhs Rupees Only).

// By the order of the Court //
M.V. KAMESWARA RAO
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9441568879.

కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవడం ఇలా...

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో వాహనాల రాకపోకలకు సంబంధించి పలు ఆంక్షలు విధించారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి హాజరయ్యే కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థుల ప్రవేశాలకు సంబంధించి, ఇతర ఏర్పాట్లపై ఎస్‌పి జి.ఆర్ రాధిక పలు సూచనలు చేశారు.

రూట్ మ్యాప్ ఇలా...

- శ్రీకాకుళం నగరం వైపు నుంచి లెక్కింపు కేంద్రానికి వచ్చే వారు జాతీయ రహదారి మీదుగా కింతలిమిల్లు కూడలి వద్ద సర్వీసు రోడ్డులోకి ప్రవేశించి ఎచ్చెర్ల పోలీసు స్టేషన్, అంబేద్కర్ విశ్వవిద్యాలయం మీదుగా శివానీ కళాశాల దగ్గరలోని పైవంతెన కింద ఉన్న అండర్ పాస్ వద్దకు చేరుకోవాలి.
- అక్కడ వారి గుర్తింపు పత్రాలను తనిఖీ చేసి, పార్కింగ్ ప్రదేశానికి అనుమతిస్తారు. ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్ మీదుగా చిలకపాలెం వైపునకు ఎటువంటి భారీ వాహనాలకు అనుమతి లేదు.
- సాధారణ ప్రయాణికుల వాహనాలను శివానీ కళాశాల దగ్గరలోని పైవంతెన కింద ఉన్న అండర్ పాస్ నుంచి చిలకపాలెం వైపు నకు సర్వీస్ రోడ్డు మీదుగా పంపుతారు.
- శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు గేట్-1 నుంచి వెళ్లి పార్మసీ బ్లాక్‌లోని లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలి.
- ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలకు చెందిన వారు గేట్-3 నుంచి ట్రిపుల్ ఐటి బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి వెళ్లాలి.
- కౌంటింగ్ సిబ్బంది, పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లకు చెందిన వాహనాలను గేట్-2 దాటిన తర్వాత వారికి కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.
- గుర్తింపు కలిగిన మీడియా ప్రతినిధులు కళాశాల ప్రధాన ద్వారం మీదుగా లోపలకి ప్రవేశించి వారికి కేటాయించిన స్థలంలో వాహనాలను నిలపాలి.
- లెక్కింపు ప్రక్రియ ముగిసిన అనంతరం కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్ల వాహనాలను చిన్నరావుపల్లి రోడ్డు మీదుగా అజ్రాం అండర్ పాస్ నుంచి వెళ్తూ జాతీయ రహదారి మీదుగా శ్రీకాకుళం వెళ్లాల్సి ఉంటుంది.

ముగిసిన కౌంటింగ్ డ్రై రన్

శ్రీకాకుళం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి సంపూర్ణ శిక్షణ ఇచ్చామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు నియమించిన మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సిబ్బందికి స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఓట్ల లెక్కింపుపై మాక్ డ్రిల్‌ను సోమవారం నిర్వహించారు. కౌంటింగ్ డ్రై రన్ సందర్భంగా ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ వంటి కీలక అంశాలపై స్పష్టమైన సూచనలు జారీ చేశామన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాల వద్ద, పరిసర ప్రాంతాల్లో విధుల్లో నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి బందోబస్తు విధి విధానాలపై సోమవారం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి, గుర్తింపు కార్డు పరిశీలన అనంతరం అనుమతించాలని స్పష్టం చేశారు. ఏజెంట్లు, అభ్యర్థులకు కేటాయించిన మార్గాల ద్వారా లోపలకు పంపించాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. కేటాయించిన ప్రదేశాల్లో వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేయించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు విధులు నిర్వర్తించాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉందని, నలుగురి కంటే ఎక్కువమంది గుమిగూడి ఉండకుండా చూడాలని చెప్పారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడానికి వీల్లేదన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా కవ్వింపు చర్యలు, ఘర్షణలకు ఎవరైనా పాల్పడితే వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పలు పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, ఉద్యోగస్తులకు వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరికి సూచించిన ప్రదేశాల్లో వారికి సంబంధించిన వాహనాలను వరుస క్రమంలో పార్కింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో పోలీసు అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే తగిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక బలగాలను సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఘర్షణలకు పాల్పడిన, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించిన, శాంతిభద్రతల సమస్యలు తలెత్తే విధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా బందోబస్తులో పాల్గొన్న ప్రతిఒక్కరూ బాధ్యతగా, అప్రమత్తతో విధులు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు జి.ప్రేమకాజల్, డి.గంగాధరం, వి.ఉమామహేశ్వరరావు, డిఎస్‌పిలు వై.శృతి, ఎ.త్రినాథరావు, శ్రీనివాసరావు, ఎల్.శేషాద్రి నాయుడు, రాజారావు, సిఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలి

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కౌంటింగ్ ప్రక్రియలో కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శ్రీకాకుళం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల టిడిపి కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 17సి ఫారం ప్రకారం క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఇటిపిబి ఓట్లు కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పొరపాట్లు జరుగుతున్నట్లు గుర్తిస్తే అక్కడున్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఓటు విలువైందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం అసెంబ్లీ టిడిపి అభ్యర్థి గొండు శంకర్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, నాయకులు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, ఎ.రవీంద్ర, కొర్ను ప్రతాప్, మెండ దాసునాయుడు, బొనిగి భాస్కరరావు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం

టెక్కలి రూరల్ : ఎన్నికల ఫలితాలు అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చివేవడం నిషేధమని టెక్కలి డిఎస్‌పి డి.బాలచంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో డిఎస్‌పితో పాటు నలుగురు సిఐలు, పది మంది ఎస్‌ఐలు, 134 మంది సివిల్ ఫోర్స్, 72 మంది హోంగార్డులు, ఆర్మడ్ రిజర్వ్, ఎస్‌టియుఫ్, సెంట్రల్ ఫోర్స్ సిబ్బందితో నిఘా ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 6 వరకు 144 సెక్షన్ అమలు ఉందని అన్నారు.

బహుమతులు అందజేస్తున్న శ్రీరామ్మూర్తి

వేసవి వినోదం ముగింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసి వారిలో మానసిక పరిపక్వతను పెంచు కునేందుకు క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన వేసవి వినోదం కార్యక్రమం దోహద పడుతుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీరామ్మూర్తి అభిప్రాయపడ్డారు. క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గతవారం రోజులుగా క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన వేసవి వినోదం సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆయన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారికి ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో కొత్తకోట అప్పారావు, పొందూరు అప్పారావు, ఎం.వాసుదేవరావు పాల్గొన్నారు.

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

గోవిందరాజులు

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న బాడాన గోవింద రాజులుకు రాజస్థాన్ ఆల్వార్ సన్రైజ్ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ పిహెచ్‌డి పట్టాను మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఇదే యూనివర్శిటీ సివిల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పలనిస్వామి మార్గదర్శకత్వంలో 'డిజైన్ అండ్ స్ట్రక్చరల్ ఆప్టిమైజేషన్ మెథడ్ ఫర్ ఎ డెక్ సిస్టమ్ యుటిలైజింగ్ ఆల్ స్టీల్ సేండ్విచ్ పేనల్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ పిహెచ్‌డి పట్టాను సన్రైజ్ యూనివర్సిటీ జారీ చేసిందన్నారు. బి.గోవిందరాజులు డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెడ్డి డీన్ డాక్టర్ డి.ఆజాద్, సివిల్ హెచ్‌డి డాక్టర్ పి.దినకర్, సిబ్బంది అభినందించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జెసి జిల్లా కార్యదర్శిగా మణికంఠ

మణికంఠ

కోటబొమ్మాళి: నేషనల్ హుమన్‌రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా జనరల్ సెక్రెటరీగా కోటబొమ్మాళికి చెందిన తంగుడు మణికంఠను నియమించారు. ఈ మేరకు ఆ శాఖ నేషనల్ ప్రెసిడెట్, ఫౌండర్ డాక్టర్ మాహతబ్ రాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మణికంఠ ఏడాది పాటు జనరల్ సెక్రెటరీగా సేవలు అందిస్తారని ఆ సంస్థ ఉత్తర్వుల్లో పేర్కొంది. మణికంఠ నియామకంపై సత్యశ్రీనివాస్, కోరాడ గోవిందరావు, ద్వారకలు అభినందించారు.

శిక్షణ ఇస్తున్న మనోజ్‌కుమార్

'ఐతమ్' అధ్యాపకులకు శిక్షణ

టెక్కలి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న స్టార్టప్లపై విద్యార్థులు దృష్టిపెట్టేలా ప్రతీ అధ్యాపకుడు బాధ్యతగా కృషి చేయాలని హైదరాబాదుకు చెందిన టెక్నాలజీ డెవలపర్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మెంటార్ మనోజ్‌కుమార్ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఐఐసి విభాగం ఆధ్వర్యాన డిజైన్ కింగ్ అండ్ ఎంటర్ పెన్యూర్షిప్' అనే అంశంపై అధ్యాపకులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. స్టార్టప్లకు కావాల్సిన అనేక మంచి ఆలోచనలు విద్యార్థులు అభివృద్ధి చేసుకొనేలా తనవంతు శిక్షణ ఇస్తానన్నారు. ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడు తూ అధ్యాపకులు పూర్తి సమయం ఈ శిక్షణకు వెచ్చించా లన్నారు. కేవలం సర్టిఫికేట్ కోసం కాక విషయంపై పూర్తి అవగాహన కలిగేందుకు శిక్షణ పొందాలన్నారు. స్టార్టప్‌ల అభివృద్ధికి ఐతమ్ కళాశాల ప్రత్యేక దృష్టి సారించి పరిశోధనలకు, వర్కుషాపుల కోసం కొంత మొత్తాన్ని కేటాయించిందన్నారు. ఈ విభాగాన్ని మరింత బలోపేతం చేయుటకు కావాల్సిన చర్యలను తీసుకొని విద్యార్థులు పారిశ్రామికంగా అభివద్ధి చెందుటకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐఐసి ఇన్‌ఛార్జి సతీష్‌కుమార్, గిరీష్ పాల్గొన్నారు.

పుట్టిన రోజు పండగ.. పర్యావరణానికి అండగా...

మొక్కలు నాటుతున్న నీతూశ్రీ తల్లిదండ్రులు

రణస్థలం: పుట్టిన రోజు వేడుకల్లో కేకులు కట్ చేయడానికి బదులు ప్రకృతిని పరిరక్షించే సంప్రదాయాన్ని బాల్యదశ నుంచే అలవాటు చేయాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. సోమవారం హరిత సొసైటీ కోశాధికారి సాడి రమణ, దేవి దంపతుల కుమార్తె నీతూశ్రీ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని పతివాడపాలెం శివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత, తల్లిదండ్రులు తమ పిల్లల పుట్టిన రోజు పేరిట భారీ వేడుకలకు ధనాన్ని వృధా చేస్తున్నారన్నారు. తమ కుమార్తె పుట్టిన రోజు నాడు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన సాడి రమణ, దేవి దంపతుల ఆలోచనకు హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో వైద్యనాధేశ్వర దేవాలయం ధర్మకర్త, సెక్రటరీ పి.సుబ్రహ్మణ్య శర్మ, హరిత సొసైటీ సెక్రటరీ పి.తవిటినాయుడు, హరిత సభ్యులు పి.రమణ, వై.లహరి, ఆర్.భవాని, ఎం.వి.రత్నాకర్, రామారావు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో ఉచిత సేవలు తెలుసా..?

రణస్థలం: పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ వాహనాల్లో నింపుకుని డబ్బులు చెల్లించి వెళ్లిపోవడమే తప్పా చాలా మందికి పెట్రోల్ బంక్‌లో లభించే ఉచితసేవలు కోసం తెలియదు. అందులో ముఖ్యంగా ఫస్ట్ ఎయిడ్. చిన్నపాటి ప్రమాదాలకు గురైనప్పుడు క్లీనిక్‌లో అందించే ఫస్ట్ ఎయిడ్ కిట్టును పెట్రోల్ బంక్‌లోనే పొందవచ్చు. ప్రయాణాల్లో తలనొప్పి, జ్వరంతో పాటు ఇతర ఇబ్బందులకు గురైన వారికి బంక్‌లో మందులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటితో పాటే పరిశుభ్రమైన మరగుదొడ్లు అందుబాటులో ఉండాలి. తాగడానికి, బాటిల్‌లో తీసుకెళ్లడానికి కచ్చితంగా మంచి నీళ్ల సౌకర్యం కల్పించాలి. వాహనాల టైర్లకు ఉచితంగా ఎయిర్ ఫిల్ చేయాలి. వీటిలో ఏ విషయంలోనైనా అసౌకర్యం ఏర్పడితే (సిపిజిఆర్ఎఎంఎస్- హెచ్ఒఎంఇ) వెబ్‌సైట్‌లో నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు ఇవ్వవచ్చు. దీనికి తక్షణ పరిష్కారం కూడా లభిస్తుంది. అలాగే ఆ బంక్ యాజమాన్యంపై కఠిన చర్యలతో పాటు దాని లైసెన్స్‌ను రద్దు చేసే అవకాశముంది.

పోస్టల్ బ్యాలెట్ల తరలింపు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లోని వివిధ రకాల ఉద్యోగులకు చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల బ్యాక్సులను లెక్కింపు కేంద్రమైన ఎచ్చెర్ల మండలంలోని శివాని కళాశాలకు సోమవారం తరలించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గదిని నుంచి సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు మధ్య తరలించారు.

పలాస: పలాస నియోజకవర్గానికి సంబంధించి ఉపాధ్యాయులు, ఉద్యోగుల పోస్టల్ ఓట్ల బ్యాలెట్లను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్థానిక జూనియర్ కళాశాల స్ట్రాంగ్‌రూమ్ నుంచి ఎచ్చెర్ల శివాని ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. ఎన్నికల ముందు పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించగా, వాటిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తుండడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాటిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య తరలించారు. మొత్తం 26 బాక్సుల్లో ఓట్లను తరలించినట్లు ఆర్ఒ పకటించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఎస్.ఎస్.ఎస్.నాయుడు, ఎం.సురేష్, టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, వైసిపి నాయకులు అల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : పర్యవేక్షిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఉపాధి హామీ పనులు కల్పించాలని స్థానిక హడ్కో కాలనీకి చెందిన పలువురు కూలీలు కోరారు. ఈ మేరకు ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయానికి వచ్చి ఎపిఒ జి. హరిప్రసాద్‌కు, మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి సిబ్బందికి వేర్వేరుగా సోమవారం వినతిపత్రం అందజేశారు. కూలీలకు ఎటువంటి పనులు లేవేని, ఇలాంటి సమయంలో తమకు పనులు కల్పించాలని విన్నవించారు. మరో రెండు వారాలు పోతే తమకు వ్యవసాయ కూలి పనులు దొరుకుతాయని, అలాంటి సమయంలో మాకు పనులు కల్పిస్తే లాభం ఉండదని వారు అన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు.

ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం లెక్కింపు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని 72 రోజుల హుండీ ఆదాయం సోమవారం లెక్కించామని, రూ.4.92.883లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్. రవికుమార్ ఆధ్వర్యాన ఈ హుండీల లెక్కింపు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, కమిటి సభ్యులు, బెవర పుణ్యవతి, సకాలభక్తుల తిరుమలరావు, దేవాదాయ, యూనియన్ బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- కవిటి

వర్షాకాలంలో వ్యాధుల తీవ్రత పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా పంచాయతీల పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ వారు గుర్తించిన సమస్యలు వెంటవెంటనే పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు పర్యవేక్షించాలని సూచించారు. పంచాయతీల విద్యుత్ బిల్లులు, ఆర్థిక లావాదేవీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమా వేశంలో కార్యదర్శులు మన్మథరావు, ఖాన్ అబ్దుల్, గుణవతి పాల్గొన్నారు.

ఆహార పొట్లాలను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రాపురంకు చెందిన కొల్లి తోషిక జన్మదినం సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధలకు, వృద్ధులకు, విక లాంగులకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ వెంకటేష్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే రక్తదాన శిబిరాలు, పేద కుటుంబాలకు ఆర్థికసాయం తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో విస్తృత కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రామారావు, సురేష్, ప్రదీప్, సంతోష్ పాల్గొన్నారు.

అన్నదానం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని గుజరాతీపేట, తోటవీధిలో హనుమత్ జయంతిని పురస్కరించుకుని సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హయాతీనగరం, పాజుల్‌బాగ్‌పేట, గుజరాతీపేట, పిఎన్‌కాలనీ పరిసర ప్రాంతవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అన్న సమారాధన నిర్వాహక కమిటీసభ్యులు షణ్ముఖ, చిన్న, రాము, గణేష్, సూర రమణ, వినాయక, శనగల ఆనంద్, వెంకటరావు పాల్గొన్నారు.

అంధులకు అన్నదానం

పలాస: అంధులకు చేస్తున్న సేవ వెలకట్టలేనిదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గలో ముకుంద పండా ఆధ్వర్యాన ప్రతి సోమవారమూ నిర్వహిస్తున్న అంధులకు చేస్తున్న అన్నదానం, ఆర్థికసాయం సోమవారం అందించారు. ముందుగా వెంకటేశ్వర ఆలయాన్ని సందర్శించారు. కార్యక్మంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.కామేశ్వరరావు, గురిటి సూర్య నారాయణ, కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, ఎ.కృష్ణ మూర్తి, ఎం.నరేంద్రబాబు, ఎస్. రాంబాబు, కె.నర్సింహ, రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు, జి.మల్లేష్ పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

జీడి మద్దతు ధర ప్రకటించే వరకు పోరాటం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస, వజ్రపుకొత్తూరు

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు ఆదుకొనే వరకు పోరాటం చేస్తామని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ స్పష్టం చేశారు. పలాస మండలంలోని రంగోయి, మందస మండలం బేతాళపురం, వజ్రపుకొత్తూరు మండలం గడూరు, గణపల్లి, అక్కుపల్లి తదితర గ్రామాల్లో జీడి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సోమవారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి రైతాంగానికి మద్దతు ధరపై వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. గెలిచిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యమంలో రాజ కీయాలకు అతీతంగా రైతులంతా ఐక్యంగా పాల్గొని, తమ లక్ష్యసాధనలో చివరిదాకా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోనారి మోహన రావు, కోనేరు గురయ్య, నెయ్యల గణపతి, కుత్తుం వినోద్, కీలు తవిటయ్య, సాతుపల్లి కష్ణారావు, జుత్తు నాగేష్, తెప్పల కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికోద్యోగులకు ఇసిహెచ్ఎస్ సేవలు

మెడికవర్‌లో ప్రత్యేక కౌంటరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోనే కాక ఇతర ప్రాంతాల్లో నివాస ముంటున్న మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు ఇసిహెచ్ఎస్ పథకం ద్వారా మెడికవర్ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందవచ్చని మెడికవర్ ఎండి డా.దానేటి శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో మాజీ సైనికుద్యోగుల కోసం ఇసిహెచ్ఎస్ కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసిహెచ్ఎస్ కార్డు ఉన్న ప్రతి మాజీ సైనికుడికి, కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్యం మెడికవర్ ఆస్పత్రిలో అందిస్తామని తెలిపారు. జిల్లా ఎక్స్‌సర్వీస్ మెన్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ గత రెండేళ్లుగా మెడికవర్ ఆస్పత్రిలో ఎంపానల్మెంట్ కోసం చాలా కష్టపడ్డామన్నారు. సహకరించిన సెంటర్ హెడ్ సాగరిక, డాక్టర్ శివలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇసిహెచ్ఎస్ అధికారిగా కొనసాగిన మెండ నారాయణరావు, ప్రస్తుత అధికారి బగాది చంద్రశేఖర్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్‌లో జాయింట్ సెక్రటరీ పూడి హరిప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బి.సంజీవ రావు, టి.కృష్ణారావు, ఎస్.ఎల్ రావు, వి.సూర్యనారాయణ, పి.మురళీధరరావు పాల్గొన్నారు.

మాజీ సైనికోద్యోగులతో దానేటి శ్రీధర్

మాట్లాడుతున్న డాక్టర్ నరసింహరావు

ఎఆర్‌టి సెంటర్‌లో హెల్ప్‌డెస్క్

శ్రీకాకుళం అర్బన్: హెచ్ఐవి వ్యాధిగ్రస్థుల జీవిత భాగస్వాములు, వారి పిల్లలకు పరీక్షలు ఎఆర్‌టి కేంద్రంలోనే నిర్వహించనున్నట్లు ఎఆర్‌టి నోడల్ అధికారి డాక్టర్ నరసింహరావు తెలిపారు. సోమవారం రిమ్స్ ఆస్పత్రిలో ఉన్న ఎఆర్‌టి సెంటర్‌లో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలను అనుసరించి జిల్లా సర్వజన ఆస్పత్రి ఎఆర్‌టి కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌ను ఆయన ప్రారంభించారు. సోమవారం నుంచి నిరంతరాయంగా ఈ కేంద్రం సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎఆర్‌టి మందులు వాడుతున్న వారితో పాటు జీవిత భాగస్వామి, పిల్లల ఆరోగ్య పరిస్థితిని కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఈ కేంద్రం పని చేస్తుందన్నారు. నియంత్రణ సంస్థ ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షించాలని, వ్యాధి వ్యాప్తిని నియంత్రి ంచడానికి ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. డాక్టర్ సిహెచ్ అప్పల నాయుడు, డాక్టర్ చైతన్య, డిపిఎం కె.ఉమా మహేశ్వరరావు, జె.సంతోష్‌కుమార్, తారకేశ్వరరావు, పి.ఉష, హెచ్. నాగభూషణం, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది హాజరయ్యారు.

సేవాతత్పరుడు హారికా ప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

హారికా కనస్ట్రక్షన్స్ అధినేత, లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు కెవిఎన్ ఎస్‌వి ప్రసాద్ (హారికా ప్రసాద్) సేవాతత్పరుడని, సమాజహితం కోరుకునే వ్యక్తిత్వం కలిగిన వారని లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు అన్నారు. హారికాప్రసాద్ పుట్టినరోజును పురష్కరించుకుని నగరంలో పలు సేవా కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో సత్యసాయి అన్నపూర్ణ సత్రంలో సుమారు 400 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథనాయుడు మాట్లాడుతూ సమస్త మానవాళికి సేవాగుణం అలవర్చిన గొప్ప మహోన్నత వ్యక్తి సత్యసాయి బాబా అని, ఆయనను స్మరించుకుంటూ అన్నదానం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యంలో హంగరీ ఫీడింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. అనంతరం గాంధీనగర్‌లో హారికా ప్రసాద్ స్వగృహంలో కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, కార్యాలయ సిబ్బంది సమక్షంలో కేకు కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన భార్య, లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి జోనల్ చైర్మన్ కరణం శోభారాణి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, తర్లాడ అప్పలనాయుడు, మణిశర్మ, డాక్టర్ సత్యస్వరూప్, జెఎన్‌టి నాయుడు, లక్ష్మణ్, సుమన్, కృష్ణ, నిహార్ నాయుడు, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు, కార్యాలయ మేనేజర్ రాఘవ కుమార్, ప్రదీప్, సాగర్, అనీల్, తిరుపతి, ప్రసన్న, నిరంజన్, రాజు, భార్గవ్, హారిక, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, తులసి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న హారికా ప్రసాద్ కుటుంబసభ్యులు

మద్యం దుకాణాల వద్ద మందుబాబుల రద్దీ

మద్యం దుకాణం వద్ద ఉన్న మందుబాబులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మూడు రోజులు మద్యం షాపులు మూసి వేయనున్నట్లు తెలియడంతో మద్యం కొనుగోలుకు మందుబాబులు ఎగబడ్డారు. పట్టణం, మండలం పరిధిలో ఉన్న పలు మద్యం షాపులతో పాటు సరుబుజ్జిలి, రొట్టవలస మద్యంషాపుల వద్ద కూడా మందుబాబులు సందడి ఎక్కువగా కనిపించింది. ఈనెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్న సందర్భంగా మద్యం షాపుల్లో అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు ఇటీవల ఎన్నికల కమిషనర్ ప్రకటించడంతో మందుబాబులు ముందు జాగ్రత్తగా మూడు రోజులకు సరిపడా మద్యాన్ని కొనుక్కొని తీసుకు వెళ్తున్నారు. దీంతో మద్యం దుకాణాలు కొనుగోలుదారుల సందడితో కిక్కిరిసి కనిపించాయి. మద్యం ప్రియులు ఒక్కసారిగా మద్యం షాపులకు చేరుకోవడంతో మద్యం అమ్మకాలు ఊపందుకున్నాయి. అలాగే కొన్ని షాపులు వద్ద అధిక సంఖ్యలో మందుబాబులు మద్యం కొనుగోలుకు రావడంతో షాపు నిర్వాహకులు క్యూలైన్‌లో పెట్టి మద్యం అమ్మకాలు చేపట్టారు.

ఊడిన పిహెచ్‌సి శ్లాబ్ పెచ్చులు

బిక్కుబిక్కుమంటున్న రోగులు

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సోమవారం ఫార్మసీ గది శ్లాబ్ పెచ్చులూడి కిందకు పడిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అరబిందో లేబొరేటరీస్, ప్రభుత్వం సంయుక్త భాగ స్వామ్యంతో నూతనంగా ఆధునికీ కరించారు. పాత నిర్మాణాలకే మీద మీద హంగులు ఆర్భాటాలతో నాణ్యతలేని పనులు చేపట్టారని పలువురు విమర్శిస్తున్నారు. నూతన భవనాలే కుప్పకూలడంతో మండల ప్రజలు రోగులు ఆస్పత్రికి వెళ్లాలంటే భయమేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నాణ్యతలేని నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఊడిన ఆస్పత్రి శ్లాబ్ పెచ్చులు

గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు

నందిగాం : స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్ కిరణ్ అధ్యక్షతన విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సహాయకులు కె.రాములమ్మ పాల్గొన్నారు.

టెక్కలి : విద్యార్థి దశ నుంచే పరిసరాలపై అవగాహన పెంచుకోవాలని గ్రంథాలయాధికారి బి.రూపావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పర్యావరణ సమతుల్యత అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం వాతావరణ కాలుష్యం నియంత్రణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ అన్నారు. విద్యార్థులతో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- లావేరు

కృష్ణారావు (ఫైల్)

మండలంలోని జాతీయ రహదారి సుభద్రపురం కూడలి వంతెనపై గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయనగరం జిల్లా గరివిడి మండలం శివరాం మాజీ సర్పంచ్ గవిడి కృష్ణారావు (62) లావేరు మండలం మురపాక తన అత్తారింటికి ఆదివారం రాత్రి దిచక్ర వాహనంతో వస్తుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారిలో సుభద్రపురం ఫ్లైఓవర్ వంతెనపై గుర్తు తెలియని వాహనం కృష్ణారావును ఢీకొని వెళ్లిపోవడంతో కృష్ణారావు అక్కడికక్కడే మృతిచెందారు. రహదారి పైనుంచి వెళ్లే వాహన దారులు చూసి స్థానికులకు చెప్పగా అప్పటికే కృష్ణారావు మృతి చెందినట్లు గుర్తించారు. ఆయన కుమారుడు గవిడి శ్రీధర్ ప్రస్తుతం శివరాం సర్పంచ్‌గా పని చేస్తున్నారు. కుమారుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు లావేరు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. మృతదేహానికి శవపంచనమా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి నట్టు పోలీసులు తెలిపారు.

టెక్కలిలో ట్రాఫిక్ ఆంక్షలు

టెక్కలి : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో ఆంక్షలు విధించామని సిఐ పైడయ్య సోమవారం తెలిపారు. మెళియాపుట్టి కూడలి వద్ద ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ఒడిశా రాష్ట్రాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహానాలను తనిఖీ చేస్తామన్నారు. మంగళవారం పట్టణంలో దుకాణాలు తెరుచుకున్నా... ఎక్కడా గుమిగూడిన వాతావరణం ఉండకూడ దన్నారు. ఫాస్టుఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, హోటళ్లు తెరవకూడదని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో చాలాచోట్ల ఆంక్షలు విధిస్తూ... దుకాణదారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

అప్పలరాజు విజయం ఖాయం

పిఎసిఎస్ చైర్మన్ మధుకేశవరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిన వైసిపి అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధిస్తారని పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు అన్నారు. సోమవారం నగరంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత పలాసలో అభివృద్ధి పరవళ్లు తొక్కిందన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించి ఉద్దానం ప్రజల ఆశాజ్యోతిగా అప్పలరాజు నిలిచారన్నారు. వజ్రపుకొత్తూరు-కాశీబుగ్గ, టెక్కలిపట్నం-నువ్వలరేవు రోడ్డు విస్తరణ పనులు, శరవేగంగా జరుగుతున్న కాశీబుగ్గ రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం అభివృద్ధికి మచ్చుతునకన్నారు.

ఆపరేషన్ కోసం వెళ్తున్న రోగులు

78 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని లక్కివలసలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ ఆధ్వర్యాన కీర్తిశేషులు పట్నాన రమణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు పట్నాన మన్మథరావు కుటుంబ సభ్యులు ఆధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆస్పత్రి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ శిబిరంలో 78 మంది నేత్రాలను పరీక్షించి 38 మందికి నేత్ర ఆపరేషన్ కోసం శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ నేత్రఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ టి.శివప్రసాద్, క్యాంప్ కో-ఆర్డినేటర్ టి.రామారావు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పనులను చేస్తున్న భారీ యంత్రం

చురుగ్గా రైల్వే వంతెన పనులు

ప్రజాశక్తి- టెక్కలి

రైల్వేస్టేషన్ల అభివృద్ధిలో భాగంగా మండలంలోని నౌపడ రైల్వే కూడలిలో ఫుట్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అమృత్ భారత్ పథకంలో భాగంగా నౌపడ రైల్వే కూడలిలో రెండో ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా సోమవారం భారీ యంత్రాలతో బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టారు. ఈ మేరకు ట్రాక్‌పైన ఉన్న విద్యుత్ లైన్లకు తగలకుండా చేపట్టిన పనుల్లో భాగంగా కొంత సేపు కూడలిలో లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అయితే రైళ్ల రాకపోకల సమయాలను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుకుండా చేపట్టిన పనులను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఇప్పటివరకు రైల్వే కూడలిలో ఒక ఫుట్ బ్రిడ్జి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరో బ్రిడ్జి మంజూరు కావడం, పనులు చురుగ్గా సాగడం గమనార్హం.

మనోహర్‌ను కలిసిన దుర్గారావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరుపున కష్టపడి పని చేసిన వారికి కూటమి ప్రభుత్వం వస్తే సముచిత స్థానం కల్పిస్తామని జనసేన పిఎసి చైర్మన్, తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చినట్లు జనసేన నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ బిసి సంఘాల ప్రతినిధులతో సోమవారం ఆయనను తెనాలిలో కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారని, ప్రజలు మార్పుని కోరుకుంటున్నారని మనోహర్ తెలిపారని ఆయన చెప్పారు.

మనోహర్‌తో దుర్గారావు తదితరులు